క్లుప్తంగా

జాబ్‌మేళాలో 371 మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని సన్ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 371 మంది అభ్యర్థులు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకున్నారని ప్రిన్సిపాల్ జయరాం తెలిపారు. సన్ కళాశాల ఆధ్వర్యంలో రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా వివిధ కళాశాలల నుంచి 652 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు ఎల్.కామేష్, పి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా శివానీ విద్యార్థి



ఎచ్చెర్ల : చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ తృతీయ సంవత్సర విద్యార్థి ఆసపు లోకేష్ గూగుల్ సంస్థ నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్ ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యాడు. గూగుల్ ప్రతినిధిగా కళాశాలలో అవగాహన కల్పించడం, వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు నిర్వహించడం, సహ విద్యార్థుల్లో లీడర్‌షిప్ పెంపొందించడం వంటి బాధ్యతలు నిర్వహించనున్నాడు. గూగుల్‌లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కూడా దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, యాజమాన్యం సభ్యులు, అధ్యాపకులు గురువారం అభినందించారు.

డీఈఓను కలిసిన ఎస్‌టీయూ నేతలు



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌టీయూ నాయకులు

శ్రీకాకుళం: కుప్పిలి పాఠశాలలో పదో తరగతి పరీక్షల సందర్భంగా ఏడుగురు ఉపాధ్యాయులపై నమోదైన పెండింగ్ చార్జెస్‌ను తక్షణం ఎత్తివేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జి.రమణ కోరారు. ఈ మేరకు గురువారం డీఈఓ రవిబాబును కలిశారు. ఇటీవల జిల్లా విద్యాశాఖాధికారిగా పూర్తి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అభినందిస్తూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గార క్లస్టర్ పాఠశాలలోని తెలుగు క్లస్టర్ స్కూల్ అసిస్టెంట్‌ను సంబంధిత క్లస్టర్ పరిధిలో పని చేయించకుండా ఖాళీగా ఉన్న అన్ని క్లస్టర్లకు పంపిస్తున్నారని, ఇది సరికాదన్నారు. డీఈవోని కలిసిన వారిలో సంఘం కార్యదర్శి కూన శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

మహిళా కళాశాల లెక్చరర్‌కు డాక్టరేట్



డాక్టర్ ఎస్.పద్మావతి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎస్.పద్మావతి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈమె 'కాంప్రహెన్సివ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ హైడ్రోజన్ బాండెడ్ లిక్విడ్ క్రిస్టల్స్' అనే అంశంపై డాక్టర్ బి.వసుంధర పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేసి విశాఖలోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గీతం డీమ్డ్ టు బీ యూనివర్సిటీ నుంచి పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నారావు, అధ్యాపకులు, సిబ్బంది పద్మావతిని అభినందించారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరం వద్ద బీజేపీ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతీయ జనతాపార్టీ మహిళా మోర్చా, శ్రీకాకుళం ఈస్ట్ మండలం ఆధ్వర్యంలో సేవాపక్షోత్సవాల్లో భాగంగా గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని సింధూర హాస్పిటల్‌లో డాక్టర్ పైడి సింధూర నేతృత్వంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు సిబ్బంది సమక్షంలో పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాల్, మహిళా మోర్చా రాష్ట్ర ప్రతినిధులు పెడాడ సూర్యకుమారి, సెవ్వాన ఉమామహేశ్వరీ, అట్టాడ రవిబాబ్జి, బిర్లంగి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంలా కాదు.. అధ్వానంగా మార్చారు!

మేం అధికారంలోకి వస్తే ఇప్పుడున్న గోతుల రోడ్లను అద్దంలా మెరిపిస్తాం.. వాహనచోదకుల కష్టాలు తీరుస్తాం.. అంటూ ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు గద్దెనెక్కాక ఆ మాటే మర్చిపోయారు. గత ఏడాది చివరిలో సంక్రాంతి కల్లా గోతులు లేని రహదారులను తీర్చిదిద్దుతామని అరకొరగా మరమ్మతులు చేసి వదిలేశారు. ఇప్పుడవి మరింత దారుణంగా తయారై వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో రోడ్ల పరిస్థితి దారుణంగా మారింది.

- దయనీయంగా నగర రహదారులు
- అడుగడుగునా గోతులు
- ఇబ్బందుల్లో వాహనచోదకులు
- పట్టించుకోని పాలకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం :



పెద్దమార్కెట్‌లో మేదరవీధి వద్ద గోతులమయమైన రోడ్డు

నగరంలో రహదారులు అధ్వానంగా మారాయి. పేరుకు జిల్లా కేంద్రమైనా ఎక్కడ చూసినా గోతుల రోడ్లే దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మరింత దయనీయంగా మారాయి. పెచ్చులూడిపోయి అడుగడుగునా గొయ్యిలు ఏర్పడటంతో వాహనచోదకులు నరక యాతన అనుభవిస్తున్నారు. రహదారులను అద్దాల్లా మెరిపిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి పాలకులు అధ్వానంగా మార్చారని నగరవాసులు మండిపడుతున్నారు.

అమ్మో ఆ రహదారులా?

శ్రీకాకుళం ఏడురోడ్లు కూడలి నుంచి పాలిటెక్నిక్ రోడ్డు, పాతబ్రిడ్జి ప్రారంభం వద్ద రెండు వైపులా భారీ గోతులు ఏర్పడ్డాయి. గుజరాతీపేట, యాతపేట, పీఎన్‌కాలనీ జంక్షన్ వద్ద రాళ్లు తేలిపోయాయి. కొత్త రోడ్డు మొదలుకుని ఏడురోడ్లు కూడలి వరకు దారిపొడువునా గోతులే దర్శనమిస్తున్నాయి. ఆదివారంపేట, పెద్దరెల్లివీధి, వినాయకగుడి , కృష్ణాపార్కు వద్ద పరిస్థితి మరింత దారుణం. పాతబస్టాండ్ చేపల మార్కెట్‌కు వెళ్లే రోడ్డులో అడుగడుగునా గొయ్యిలు ఏర్పడ్డాయి. పొట్టి శ్రీరాములు కూడలి నుంచి జిల్లా పరిషత్‌కు వెళ్లే రోడ్డులో రాళ్లు తేలి ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికి తోడు పలుచోట్ల కుళాయి పైపుల లీకేజీ పనుల కోసం గోతులు తవ్వి సరిగ్గా పూడ్చకుండా వదిలేస్తున్నారు. రాత్రివేళల్లో వాటిని గమనించక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

మాకు సంబంధం లేదు..

నగరంలో రోడ్లతో తమకు సంబంధం మున్సిపాలిటీ అధికారులు.. ఆ బాధ్యత మాది కాదని ఆర్ అండ్‌బీ అధికారులు ఎవరికి వారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్రమంత్రులు, శ్రీకాకుళం ఎమ్మెల్యే సైతం దృష్టి పెట్టకపోవడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

పైపైన పనులు.. నిధులు నీటిపాలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రెండు మూడు నెలల్లో చేపట్టిన పనుల్లో నాణ్యత కరువైంది. అప్పట్లో తూతూమంత్రంగా పనులు చేపట్టడంతో రోడ్లన్నీ పాడయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వేసిన ఆ పనుల్లో డొల్లతనం బయటపడింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్ల సమస్యకు పరిష్కారం చూపాలని నగరవాసులు కోరుతున్నారు.

భయమేస్తోంది..

నగరంలోకి రావాలంటే భయమేస్తోంది. నగర రోడ్ల కంటే కొండప్రాంతాల దారులు నయమనిపిస్తున్నాయి. ద్విచక్ర వాహనంపై ఫ్యామిలీతో వెళ్లాలంటే ఫీట్లు చేయాల్సిందే. ఏ గుంతలో పడి ఎక్కడ ఎటువంటి ప్రమాదానికి గురవుతామోననే ఆందోళన వెంటాడుతోంది.

– ఎస్.ధర్మారావు, ప్రయాణికుడు, శ్రీకాకుళం నగరం

చర్యలు చేపడతాం..

నగర రోడ్లలో గోతులు ఉన్న మాట వాస్తవమే. కార్పొరేషన్ పరిధిలో ఉండే రోడ్లు గుంతలు పూడ్చేందుకు చర్యలు చేపడతాం. ఉమెన్స్ కాలేజీ రోడ్డు, 80 అడుగుల రోడ్డు, జిల్లా పరిషత్ రోడ్లు మాత్రమే కార్పొరేషన్ పరిధి. మిగిలిన రోడ్లన్నీ ఆర్అండ్‌బీ పరిధిలోకి వస్తాయి.

– పి.వి.వి.డి ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం కార్పొరేషన్



కృష్ణాపార్కు సమీపంలో రోడ్డు దుస్థితి



జడ్జి బంగ్లా ఎదురుగా రోడ్డుపై ఏర్పడిన గొయ్యి



ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బలగ వెళ్లే రహదారిలో గోతులు



పీఎన్ కాలనీ జంక్షన్ నుంచి పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే రోడ్డు దుస్థితి



దత్త దేవాలయం నుంచి సింహద్వారానికి వెళ్లే రోడ్డు ఇలా..



మున్సిపల్ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై ఉన్న గోతులు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దురదృష్టకరం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పిన్నింటి సాయికుమార్

రణస్థలం: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను పి.పి.పి. పేరుతో ప్రైవేటుకు ధారాదత్తం చేస్తున్న కూటమి ప్రభుత్వ నిర్ణయం ఆక్షేపనీయమని వైఎస్సార్ సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్ అన్నారు. రణస్థలం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించి అన్ని అనుమతులు పొందిన తరువాత ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయడం ప్రజా వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 19న పార్వతీపురం మన్యం జిల్లా మెడికల్ కళాశాల వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, కిల్లారి రమణ, సింక అప్పారావు, పిన్నింటి లక్ష్మునాయుడు, మింది శ్రీనివాస్ రెడ్డి, కిల్లారి సన్యాసినాయుడు, మహంతి సత్యం, లంక అసిరినాయుడు, పాల రాము తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు



డాక్టర్ చింతాడ వరుణ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పేదలకు వైద్య విద్య అందించాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుడితే వాటిని ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేయడం సరికాదని వైఎస్సార్ సీపీ డాక్టర్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చింతాడ వరుణ్ గురువారం పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పేదలకు వైద్యవిద్యనందించడంతో పాటు 400 బెడ్‌లతో హాస్పిటల్ ఏర్పాటుకు వీలుంటుందన్నారు. ప్రచార ఆర్భాటాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారే తప్ప మెడికల్ కాలేజీల నిర్మాణానికి రూ.500కోట్లు కేటాయించలేకపోవడం దారుణమన్నారు. అమరావతిలో గోతులు పూడ్చడానికి, నీరు తోడేందుకు ఖర్చు చేసేదానికి ఉన్న శ్రద్ధ మెడికల్ కాలేజీలు నిర్మించాలన్న ఆలోచన లేకపోవడం సరికాదన్నారు.

నవంబర్ 13 నుంచి సత్యసాయి పరబ్రహ్మోత్సవాలు



వర్చువల్‌గా మాట్లాడుతున్న లక్ష్మణరావు

శ్రీకాకుళం కల్చరల్: పుట్టపర్తి ప్రశాంత నిలయంలో సత్యసాయిబాబా 100వ పుట్టిన రోజు సందర్భంగా నవంబరు 13 నుంచి 23 వరకు పరబ్రహ్మోత్సవాల పేరుతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు సేవాసంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు జిల్లా భక్తులను ఉద్దేశించి గురువారం వర్చువల్‌గా మాట్లాడారు. పుట్టపర్తికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నవంబరు 19న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రశాంతి నిలయంలో జరిగే వేడుకల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు మాట్లాడుతూ 10వేల మందితో సత్యసాయి పర బ్రహ్మోత్సవ పర్తియాత్ర అనే పేరుతో ప్రశాంత నిలయానికి చేరేందుకు ప్రణాళిక రూపొందించిట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పదాధికారులు పప్పల నాగేశ్వరరావు, బోయిన నరసింహమూర్తి, అనాది గుప్త, మల్లేశ్వరరావు, యోగి మాస్టార్, నారాయణమూర్తి, చంద్రమౌళి, చంద్రశేఖర్, జోన్, మందిరాల కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మృదంగ లయ విన్యాసం



ఎంకేఆర్ ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: మండ కృష్ణ రామ్‌ప్రసాద్ (ఎంకేఆర్ ప్రసాద్) మృదంగానికే జీవితం అంకితం చేశారని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. నగరంలోని కత్తెరవీధిలో రాజరాజేశ్వరీ సంగీత పీఠంలో ఎంకేఆర్ ప్రసాద్ 77వ జయంతిని తరిణి కృష్ణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ శాస్త్రీయ సంగీత పరిరక్షణ కోసం ఆయన శిష్యుడు చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం మావుడూరు సూర్యప్రసాద్‌రావు మృదంగ లయ విన్యాసం చక్కగా సాగింది. సుసరాపు లక్ష్మీగణపతి శర్మచే వాయులీన సుధార్నవం జరిగింది. కార్యక్రమంలో సేవా ట్రస్టు అధ్యక్షులు మండ శ్రీనివాసరావు, ఎం.వి.కామేశ్వరరావు, మావుడూరు సత్యన్నారాయణ, డాక్టర్ కె.అమ్మన్నాయుడు, మాలతి, నిక్కు అప్పన్న పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

జి.సిగడాం: ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జి.సిగడాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పేకల సుమబిందు అన్నారు. గురువారం పెంట గ్రామంలో రోగులకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ మక్క శ్రీలత, ఏఎన్ఎం జి.భవాని , ఎంఎల్ఎహెచ్‌పీ సుభాషిని, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

● డాబాపై కలువ

శ్రీకాకుళం నగరంలోని పుణ్యపువీధిలో రమేష్, అనూరాధల ఇంటి డాబాపై కలువ పువ్వు విరిసింది. సాధారణంగా చెరువులో విరబూసే కలువ ఇంటి కుండీపై కనిపించడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

– శ్రీకాకుళం కల్చరల్



నిరాశ్రయులకు చేయూత



నిరాశ్రయులకు ఆహారం అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: నిరాశ్రయులు ఆకలితో అలమటించకూడదనేదే హంగర్ ఫీడింగ్ ముఖ్య ఉద్దేశమని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర అన్నారు. నగరంలోని పట్టణ పేదల నిర్మూలన వ్యవస్థ, నైట్ షెల్టర్‌లో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. నగరానికి చెందిన శిమ్మ వేణుగోపాల్‌రావు, జానకి కుమార్తె ద్రాక్షాయని జన్మదినం సందర్భంగా వారి కుటుంబసభ్యులు కూడా ఈ సేవా కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. కార్యక్రమంలో పలువురు లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం



మాట్లాడుతున్న జేడీ శీలం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు మనమంతా కృషిచేద్దామని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ఇందిరావిజ్ఞానభవన్‌లో గురువారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో మాట్లాడి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, జిల్లా ఇన్‌చార్జి గాదం వెంకట త్రినాధరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.సిగడాం: జి.సిగడాం, బాతువ విద్యుత్ సబ్‌స్టేషన్లలో 33/11 కేవీ లైన్ మరమ్మతుల సందర్భంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈఈ పైడి దుర్గాప్రసాద్ గురువారం తెలిపారు. బాతువ, జి.సిగడాం, చెట్టుపొదిలాం, గొబ్బూరు, నిద్దాం, ముషినివలస, డి.ఆర్.వలస, పున్నాం, ఎందువపేట, అద్వాన్నంపేట, చంద్రయ్యపేట, మధుపాం, వెలగాడ, దేవరవలస, ఎస్.పి.ఆర్.పురం, నడిమివలస, ఎందువ, గెడ్డకంచరాం, జాడ, ఎందువపేట,జగన్నాథవలస, సేతుభీమవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రక్తదానంపై అపోహలు వీడాలి

శ్రీకాకుళం క్రైమ్: రక్తదానం పట్ల అపోహలు వీడి స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా ఔషధ నియంత్రణాధికారి ఎం.చంద్రరావు అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా స్థానిక కెమిస్టు అండ్ డ్రగ్గిస్ట్ భవనంలో మెడికల్ అసోసియేషన్, బ్లడ్‌సెంటర్, అపోలో, మెడ్‌ప్లస్ సంస్థల సహకారంతో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఔషధ వర్తకుల సంఘం సభ్యులు 83 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజనాసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బి.రాజశేఖర్, సూపరింటెండెంట్ డాక్టర్ సి.అమూల్య, రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, టెక్కలి డ్రగ్ఇన్‌స్పెక్టర్ నక్క యుగంధర్, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కరుణ్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న డ్రగ్ ఏడీ చంద్రరావు

వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేద్దాం



ధర్మాన ప్రసాదరావుతో ఎస్సీసెల్ నాయకులు

శ్రీకాకుళం రూరల్: జిల్లాలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు కలిసికట్టుగా పనిచేస్తామని పార్టీ ఎస్సీసెల్ నాయకులు మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావుకు తెలియజేశారు. ఈ మేరకు గురువారం పెదపాడు పరిధిలోని ధర్మాన క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. బుధవారం జిల్లాస్థాయిలో జరిగిన ఎస్సీసెల్ విస్తృత స్థాయి సమావేశం ఎస్సీ నాయకుల్లో స్ఫూర్తి నింపిందని, తమ సందేశంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ సెల్ నాయకులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తారని చెప్పారు.

కార్యక్రమంలో ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నాడ రుషి, సంయుక్త కార్యదర్శి పెయ్యిల లక్ష్మణరావు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ విభాగం ఇన్‌చార్జి యజ్జల గురుమూర్తి, ముకుందరావు, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల చెంతనే మురుగునీరు



పొందరవీధి పాఠశాల వద్ద నిలిచిన మురుగునీరు

గార : శ్రీకూర్మం గ్రామంలోని పొందరవీధి ప్రాథమిక పాఠశాల వద్ద మురుగు నీరు నిలిచిపోవడంతో దుర్గంధంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాల పక్క ఉన్న మాధవరాయుని బంద నిండిపోవడంతో నీరంతా ఇక్కడికి వచ్చి నిలిచిపోతోంది. చెరువులో ఉపాధి పనులు చేసే సమయంలో గట్లు ఎత్తు పెంచడం, కిందకి వెళ్లే ఔట్‌లెట్ వద్ద ఆక్రమణలు ఉండటంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగునీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

విశ్వకర్మకు విశేష పూజలు



గుజరాతిపేటలో విశ్వకర్మ పూజలు



చంపాగల్లి వీధిలో లక్ష్మీ గణపతి హోమం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చంపాగల్లి వీధిలో కంచి కామాక్షిదేవి స్వర్ణకార సంఘం, జిల్లా స్వర్ణకార సంఘం, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం సయుక్త ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకల్లో భాగంగా గురువారం పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సోపింటి తారకేశ్వరరావు, కార్యదర్శి కడారి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు కలిశెట్టి ఈశ్వరరావు, కోశాధికారి తాళాబత్తుల సూర్యప్రకాష్, చంద్రమౌళి, కూర్మారావు, నారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. గుజరాతీపేటలోని వీర బ్రహ్మం ఆలయంలో విశ్వకర్మ పూజలు ఘనంగా జరిగాయి. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నాదెళ్ల భార్గవ, అలుగు కోటి, లక్ష్మణరావు, పార్నంది విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.